International Journal of Enhanced Research in Educational Development (IJERED)
ISSN: 2320-8708, Vol. 9 Issue 1, January-February, 2021, Impact Factor: 7.326

దాశరథి 'యాత్రాస్మృతి'

Dr. V. Shankaraiah

Asst Professor of Telugu, Govt. Arts and Science College Kamareddy. Dist. Kamareddy. Telangana

ప్రతి మనిషి జీవిత ప్రయాణం ఒక యాత్ర. ఆ యాత్రలో ఎదురైన అనుభవాలు, జ్ఞాపకాలు ప్రత్యేకంగా ఉంటాయి. సామాన్యుల అనుభవాలు వ్యక్తిగత జీవితాల చుట్టూ తిరిగితే అసమాన్యుల అనుభవాలు సామాజిక చలనాలను, చారిత్రిక విశేషాలను నమోదు చేస్తాయి. అశేష ప్రజా సమూహాన్ని ప్రభావితం చేసిన యోధుల అనుభవాలు భావితరాలకు దారి దీపాల వలె నిరంతరం స్ఫూర్తినిస్తాయి. ఆ యోధుడు సాహిత్యకారుడైతే ఆ జ్ఞాపకాలు నిత్యం జ్వలించే అక్షరాలుగా కాంతి వెదజల్లుతాయి. ఆ కోవలో అసామాన్య యోధుడు, సాహిత్య సమర సేనాని దాశరథి కృష్ణమాచార్యులు. ఆయన అనుభవాలు, జ్ఞాపకాల పేటి 'యాత్రాస్మృతి'

దాశరథి కోటి రత్నాల తెలంగాణ వీణను మీటి నిజాం సింహాసనంపై నిప్పులు కురిపించిన ధీరుడు. ఆయన తన సంక్షుభిత, కల్లోల జీవిత యాత్రను యాత్రాస్మృతిగా మలచారు. అందులో ఆయన జీవన యాత్రలో ఎదురైన అనుభవాల పరంపర **60** వ్యాసాలుగా పుస్తక రూపంలో వెలువడ్డాయి. తన కాలం నాటి తెలంగాణ పరిస్థితులు, నిజాం నిరంకుశ పాలన కింద నలిగిపోయిన ప్రజల దీనస్థితి, దొరలు, జమీందారుల రాక్షస చర్యలు, వాటిపై జరిగిన తిరుగుబాట్లు, జైలు శిక్షలు, చెరసాలల పరిస్థితులు కండ్లకు కనబడేటట్లు చిత్రించారు దాశరథి. వాటితో పాటు ఆనాటి సాహిత్య వాతావరణాన్ని కూడా యథార్థంగా వర్ణించారు. పోలీసు చర్య తర్వాత హైదరాబాదు రాష్ట్రంలోనూ, అప్పటి మద్రాసు, ఆంధ్ర రాష్ట్రాల్లోని కవులతో గల స్నేహ పూర్వక సంబంధాలను కూడా సహజ రమణీయంగా అక్షరబద్ధం చేశారు. అందువల్ల తెలంగాణ చరిత్ర, తెలుగు సాహిత్య చరిత్రకు యాత్రాస్మృతి చక్కటి ఆకర గ్రంథంగా ఉపకరిస్తుంది అనటంలో సందేహం అవసరం లేదు.

పత్రికల కోసం దాశరథి రాసిన ఈ వ్యాసాలు ఆయన మరణించిన ఏడాదికి అంటే 1988 లో పుస్తకంగా వచ్చింది. తొలి ముద్రణ దేవులపల్లి రామానుజరావు తొలిపలుకుతో వెలువడగా తర్వాత అనేక ముద్రణలు పొందింది. తెలుగు సాహిత్యలోకంలో ఎంతో ఆదరణ పొందింది.

దాశరథి అంతరంగం అర్థం కావాలంటే ఆయన బాల్య జీవితంపై బలమైన ముద్ర వేసిన సంఘటనల గురించి తెలుసుకోవాలి. ఆ సంఘటనలు ఆయన పసి మనసులో ధిక్కార స్వభావాన్ని నూరి పోశాయి. తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఉద్యమించే సాహసం అందించాయి. ఆ సంఘటనల్లో మొదటిది ఇంట్లో జరిగింది కాగా, రెండోది బడిలో ఎదురైన దృశ్యం.

దాశరథి తండ్రి గొప్ప సంస్కృత పండితుడు. మడి కట్టుకుంటే సంస్కృతంలోనే మాట్లాడేవాడు. తెలుగులో అసలే మాట్లాడేవాడు కాదు. నువ్వెటు వెళ్తున్నావు అనడానికి 'త్వం కుత్ర గచ్ఛసి' అనేవాడు. తనకు సంస్కృతం మీద అభిమానమున్నా ఆ చాందసం దాశరథికి నచ్చలేదు. కనుక తండ్రిని ధిక్కరించాడు.

రెండోది, దాశరథి చదువుకునే బడిలో ఉర్దూ మీడియం. ప్రార్థనలోనే నిజాంను కీర్తించే గీతం ఉండేది. 'ప్రళయ కాలం దాకా పరమేశ్వరుడు ఈ రాజ్యాన్ని సుస్థిరంగా ఉంచు గాక' అనే అర్థం వచ్చేలా 'తాబద్ ఖాలిఖే ఆలం యే రియాసత్ రఖే' అనే పల్లవితో ఆ ప్రార్థన ప్రారంభమయ్యేది. విద్యార్థులందరూ ఆ గీతం పాడాలి. గొంతు కలపాలి. లేకుంటే హెడ్మాస్టర్ చేత దెబ్బలు తినాల్సి వచ్చేది. దాశరథికి ఆ గీతాలాపన నచ్చలేదు. ఇతరులతో గొంతు కలుపలేదు. ఫలితంగా దెబ్బలు తిన్నాడు.
ఈ సంఘటనలు దాశరథిలో తిరుగుబాటు బీజాలు మొలకేత్తించాయి.
రెండు రకాలుగా అది శక్తివంతమైన పుస్తకం. రచయిత సృజన చేయడమే కాదు, ఉద్యమంలో కార్యకర్తగానూ పనిచేయాలని ప్రబోధిస్తుంది. అన్యాయాన్ని ధిక్కరించడానికి బలవంతుడే కానక్కర లేదు. మనోబలం కలిగి ఉంటె చాలు.

దాశరథి మనిషి. నిఖార్సైన మనిషి. అంగారం, సింగారం రెండూ పండించగల సృజనకారుడు. 'నేను గన్ను పట్టాలనుకుంటాను. కానీ పెన్నుతో కలలు కంటుంటాను' అంటారు. 'మంచి కవిత్వం ఏ భాషలో ఉంటె అది నా భాష. మంచి కవి ఎవరైతే అతడు నా మిత్రుడు' అని చాటినవాడు.

ఇందులోని అరవై వ్యాసాలు నిజాం కాలం నాటి, రాజకీయ, సామాజిక, సాహిత్య వాతావరణాన్ని సజీవంగా చిత్రించాయి.

ఏడో నిజాం ఉస్మాన్ అలీ ఖాన్ సాహితీ పిపాసి. అప్పుడప్పుడు కవితలు కూడా రాస్తాడు. ఆయన గురువు హజ్రత్ జలీల్. నిజాం కవిత రాసినాడంటే పత్రికలు తప్పనిసరిగా ప్రచురించాలి. ఆ కవిత కింద ఆయన గురువు ప్రశంస కూడా తప్పనిసరి. గురువు ప్రశంస అచ్చువేయకపోతే ఆ పత్రిక ఉండదు. ప్రశంస చేయకపోతే ఆ గురువూ ఉండడు. అది ఆనాటి పరిస్థితి. దాశరథి యాత్రాస్మృతిలో నమోదు చేశాడు.

హైదరాబాదులో జరిగే ముషాయిరాల గురించి, వాటిలో కవిత్వాన్ని ఎట్లా ఆస్వాదిస్తారో చక్కగా వర్ణించాడు. 1950 నాటి సాహిత్య వాతావరణం, తెలంగాణతో పాటు, కోస్తాంధ్ర సాహితీవేత్తలతో ఉన్న అనుబంధాలను ఈ గ్రంధం చక్కగా వివరిస్తుంది.

చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి ఆస్థానకవిగా పదవీస్వీకార కార్యక్రమం, దాశరథి గాలీబ్ గీతాల ఆవిష్కరణోత్సవం గురించి ప్రత్యేకంగా వివరించారు.

అలాగే ఆలంపురంలో 1953 జనవరి నెలలో నాల్గు రోజుల పాటు జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తు సప్తమ మహాసభల గురించి కూడా విపులంగా ఐదు వ్యాసాల్లో తెలిపారు. అప్పటి సభలకు ప్రత్యేక రైలు ఏర్పాటు చెయ్యడం, ఉప రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు వంటి మహామహులు హాజరు కావడం, తెలుగునాట ప్రసిద్ధులైన అప్పటి సాహితీవేత్తలు కవులు పాల్గొనడం, వారి ప్రసంగాలుకూడా విపులంగా వివరించారు. కాళోజీ నా గొడవను ఆ సభల్లోనే శ్రీశ్రీ ఆవిష్కరించారు. అప్పుడు శ్రీశ్రీ కాళోజీని నిఖిలాంధ్ర కవి అన్నారు.

ఇంకో విశేషమైన అంశం కూడా మనకు తెలుస్తుంది. ఉస్మానియా విశ్వ విద్యాలయాన్ని హిందీ విశ్వ విద్యాలయంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. ఆలంపూరు సభల్లో దేవులపల్లి రామానుజరావు దాన్ని వ్యతిరేకిస్తూ మాట్లాడారు. అలాగే ధిల్లీ వెళ్లి అప్పటి విద్యామంత్రితో మాట్లాడి ఆ ప్రతిపాదన అమలు కాకుండా చేశారు.

దాశరథి దార్శనికత, పరిశీలన ఆయన ప్రస్తావించిన సంఘటనల ఆధారంగా గమనించవచ్చు. ఆపరేషన్ పోలో తర్వాత నిజాం ప్రభుత్వం కూలిపోయి హైదరాబాదు రాజ్యం భారత యూనియన్ లో కలిసిపోయిన విషయం తెలిసిందే. అప్పటి జమీందార్లు, దొరలు అప్పటి మిలిటరీ పాలకుడు మేజర్ జనరల్ జే.యన్. చౌదరీని మచ్చిక చేసుకోవాలని ప్రయత్నించారు. వారిలో ఒక జాగీర్దార్ చొరవ తీసుకొని విందుకు ఆహ్వానించాడు. వారిని ఆ అధికారి ఇలా ప్రశ్నించాడు. విందులో నాకు నాకేం పెడుతారు అని ప్రశ్నించాడు. అందుకు వారు బొంబాయి చేపలు, విదేశీ షాంపేన్ తెప్పిస్తాం అన్నారు. ఖర్చు ఎంతవుతుంది అని ఆయన అడిగాడు. చాలా పెడుతాం అన్నారట. దానికాయన ఇప్పుడే మీ ఊళ్ళో బడి చూసినాను. అది కూలిపోయి ఉంది. నా విందుకు పెడుతామనుకున్న డబ్బుతో ముందు మీ ఊరి బడి బాగు చేయించండి అని ఆదేశించాడు.

ఉపయుక్త గ్రంథాలు

1. యాత్రాస్మృతి – దాశరథి కృష్ణమాచార్య
2. అగ్నిధార – దాశరథి కృష్ణమాచార్య